క్లుప్తంగా

కూటమి ప్రభుత్వంలో ఆడపిల్లలపై పెరిగిన దాడులు



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం మండల మహిళాధ్యక్షురాలు బీ పద్మ

సంతనూతలపాడు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహిళలు, చిన్నారులకు సమాజంలో రక్షణ లేకుండా పోయిందని, ప్రతి రోజూ ఏదో ఒక చోట అత్యాచారాలు, అకృత్యాలు జరుగుతున్నాయని సీపీఎం మండల అధ్యక్షురాలు బంకా పద్మ అన్నారు. హింసా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మంగమూరు గ్రామంలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో సభ నిర్వహించారు. ఈ సభకు మహిళా సంఘం గ్రామ నాయకురాలు అన్నాబత్తిన రమణమ్మ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా నాయకురాలు షేక్ నాగూర్ బీ, నాయకురాలు షేక్ మస్తాన్ బీ ఉపాధ్యాయుడు బీ కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు కలెక్టర్‌కు ఆహ్వానం



రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఆహ్వాన పత్రం ఇస్తున్న సూదనగుంట ఫౌండేషన్ సభ్యులు

సంతనూతలపాడు: మండల కేంద్రంలోని ఎస్.ఎస్.ఎన్.కె.సి.ఎమ్. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వచ్చేనెల 5, 6, 7, 8 తేదీల్లో సూదనగుంట ఫౌండేషన్ ఆధ్వర్యంలో వ్యవస్థాపకుడు డాక్టర్ సూదనగుంట రాఘవేంద్ర ప్రసాద్, నిర్వాహకులు ఎస్.కృష్ణమూర్తి రాష్ట్రస్థాయి స్త్రీ, పురుషుల కబడ్డీ పోటీలకు కలెక్టర్ తమీమ్ అన్సారియాను ఆహ్వానించారు. ఒంగోలు కలెక్టరేట్లో మంగళవారం జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ ఎన్.చంద్రమోహన్ రెడ్డి, అధ్యక్షుడు కుర్రా భాస్కర్ రావు, వైస్ ప్రెసిడెంట్ ఇ.వి.సురేష్ బాబు, కోఆర్డినేటర్ వై సీనయ్య తదితరులు కలెక్టర్‌ను కలిసి ఆహ్వానపత్రం అందించారు.

విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీ



విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీ చేసిన సత్యనారాయణ రెడ్డి

మద్దిపాడు: మండలంలోని గుండ్లాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన పల్లకి సత్యనారాయణ రెడ్డి 20 మంది విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని కోరారు. పాఠశాల పీడీ మాధవి, ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్ మాట్లాడుతూ విద్యార్థులకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తూ వారి ఉన్నతికి కృషి చేస్తున్న గ్రామానికి చెందిన దాతలను అభినందించారు. ముందుగా 75 వ రాజ్యాంగ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వ పోటీలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థినిలు నృత్య ప్రదర్శన చేశారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులందించారు.


అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తువులు అందజేత



అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తువులు అందజేస్తున్న దాతలు

నాగులుప్పలపాడు: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు రూ.10 వేల విలువైన వస్తువులను ఉప్పుటూరి రమేష్ బాబు జ్ఞాపకార్థం వారి తండ్రి ఉప్పుటూరి సింగయ్య మంగళవారం అందించారు. 6 అంగన్‌వాడీ కేంద్రాలకు అవసరమైన ర్యాకులు, కుర్చీలు, ఆట వస్తువులు, కుక్కర్లు అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శివ నాగరాజ, ఉప్పుటూరి రమేష్ కుటుంబ సభ్యులు సుగుణ, రాజశేఖర్, అంజమ్మతో పాటు అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ప్రగడ కోటయ్యకు ఘన నివాళులు



చీమకుర్తిలో ప్రగడ కోటయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న పద్మశాలీయులు

చీమకుర్తి: చేనేత బంధు ప్రగడ కోటయ్య వర్ధంతి సందర్భంగా మంగళవారం చీమకుర్తిలోని ఆయన విగ్రహానికి పద్మశాలీయుల సంఘం ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం బీసీ హాస్టల్‌లోని విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పద్మశాలీయుల సంఘం నాయకులు మాట్లాడుతూ ప్రగడ కోటయ్య చేనేత కుటుంబాలకు చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గోపురపు రాజ్యలక్ష్మి, చంద్ర, కౌన్సిలర్లు సోమా శేషాద్రి, ఎన్.హరిప్రసాద్, దోమల పుల్లయ్య, సోమా యానాదిశెట్టి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



రంగాయపాలెం తుఫాన్ షెల్టర్‌కు పగిలిన అద్దాలు



పనిచేయని తుఫాన్ సైరన్ పరికరం



దుర్వాసన వస్తున్న మరుగుదొడ్లు, చెదలు పట్టిన తలుపులు

శిథిలావస్థలో తుఫాన్ షెల్టర్లు

- తుప్పుపట్టిన సైరన్ పరికరాలు
- పట్టించుకోని అధికారులు
- కోట్ల రూపాయలు వృథా

కొత్తపట్నం: మండలంలో తుఫాన్ షెల్టర్లు నిరుపయోగంగా ఉన్నాయి. కనీసం వర్షా కాలమన్నా వాటి సంగతి పట్టించుకునే వారే కరువయ్యారు. అధికారులు ఆ ప్రాంతానికి వెళ్లిన సందర్భాలు చాలా తక్కువ. తుఫాన్ షెల్టర్ల పర్యవేక్షణను అధికారులు పూర్తిగా వదిలేశారు. తుఫాన్ సమయంలో ప్రజలు ఇబ్బంది పడకుండా కేంద్ర ప్రభుత్వం తుఫాన్ షెల్టర్లు తీరప్రాంత గ్రామాల్లో నిర్మించింది. దానికి సంబంధించి వాటిల్లో అప్పట్లో మౌలిక వసతులు కల్పించింది. మండలంలో 2017లో జాతీయ తుఫాన్ విపత్తు నివారణ పథకం ద్వారా ఒక్కో తుఫాన్ షెల్టర్‌కు రూ.1.20 కోట్లతో 8 తుఫాన్ షెల్టర్లు నిర్మించారు. గుండమాల, మోటుమాల, పాదర్తి, రంగాయపాలెం, కె.పల్లెపాలెం, వజ్జిరెడ్డిపాలెం, ఈతముక్కల, మడనూరు గ్రామాల్లో తుఫాన్ షెల్టర్లు నిర్మించారు. అన్నింటికీ మరుగుదొడ్లు, విద్యుత్, నీటి వసతి కల్పించారు. విపత్తులు వచ్చినప్పుడు వాడుకుని, ఆ తర్వాత శుభకార్యాలు, సమావేశాలు జరపుకునేందుకు అనుకూలంగా ఉండే విధంగా ప్రభుత్వం జీవో విడుదల చేసింది. ఇవి అన్నీ రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌కు అధికారులు అప్పజెప్పారు. వారు తుఫాన్ షల్టర్ దగ్గరకు వెళ్లకుండా నిరుపయోగంగా ఉంచారు. రెవెన్యూ డిపార్ట్‌మెంట్ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో తుఫాన్ షెల్టర్లు



కె.పల్లెపాలెం తుఫాన్ షెల్టర్‌పై మొలిచిన మొక్కలు

నిరుపయోగంగా ఉన్నాయని భావించి వాటి పర్యవేక్షణ బాధ్యత వెలుగు సిబ్బందికి అప్పగించారు. తుఫాన్ షెల్టర్‌ల మెయింటెన్ ఖర్చులు విడుదల చేశారు. ఒక్కో షెల్టర్‌కు రూ.5 లక్షలు కేటాయించారు. ఆరు షెల్టర్లకే నగదు విడుదల చేశారు. రెండు షెల్టర్లకు నగదు విడుదల చేయలేదు. తుఫాన్ షెల్టర్‌కు డ్వాక్రా గ్రూప్ సభ్యులతో కమిటీ ఏర్పాటు చేసి వారి పేరుపై అకౌంట్‌లో నగదు జమ చేశారు. ఈ నగదు ఎలా వాడాలని ప్రభుత్వం నియనిబంధనలు ఇవ్వలేదు. ఆ నగదు అలాగే బ్యాంక్‌లో ఉండిపోయింది. డబ్బులు ఉన్నా వాటిని ఉపయోగించుకునేందుకు అవకాశం లేకుండా పోయింది.

అసాంఘిక కార్యకలాపాలకు నెలవు

తుఫాన్ షెల్టర్లు అసాంఘిక కార్యకలాపాలకు నెలవుగా మారాయి. డోర్లు పగలగొట్టడం, పేకాట ఆడటం, అక్కడ ఉన్న వస్తువులన్నీ దొంగలు తీసికెళ్లిన సందర్భాలు ఉన్నాయి. షెల్టర్‌పై చెట్లు మొలిచి బిల్డింగ్‌లు పగిలిపోయే స్థాయికి చేరాయి. తుఫాన్‌లు వచ్చినప్పుడు ముందు జాగ్రత్తగా అందరికి తెలియ పర్చేందుకు గ్రామం అంతా సైరన్ మోగే యంత్రం అమర్చారు. ఒక్కో తుఫాన్ షెల్టర్‌కు ఒక్కో సైరన్ అమర్చారు. ఎక్కువగా అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు తుఫాన్లు సంభవిస్తాయి. సైరన్ మోగేందుకు దానికి సంబంధించిన బ్యాటరీలు, వివిధ రకల సామగ్రి బిగించారు. దానికి గది కూడా ఏర్పాటు చేశారు. అవన్నీ పాడయ్యాయి. వాటి పర్యవేక్షణ లోపంతో అవి పనిచేయడం లేదు. ప్రభుత్వం కోట్ల రూపాయాలు ఖర్చు పెట్టినా పరికరాలు వృథా అవుతున్నాయి.

జెడ్పీ హైస్కూల్ ఆకస్మిక తనిఖీ



సంతనూతలపాడు హైస్కూల్లో విద్యార్థులతో మాట్లాడుతున్న ఉపవిద్యాశాఖాధికారి చంద్రమౌళి

సంతనూతలపాడు: మండల కేంద్రంలోని ఎస్.ఎస్.ఎన్.కె.సి.ఎమ్. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఒంగోలు ఉప విద్యాశాఖధికారి ఎ.చంద్రమౌళీశ్వర్ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులకు పాఠ్యాంశాల బోధనపై ఆరాతీశారు. ఆయన వెంట మండల విద్యాశాఖాధికారి 2 డీ వెంకారెడ్డి, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయిని ఉమామహేశ్వరి ఉన్నారు. అనంతరం పాఠశాలలో నిర్వహించిన జాతీయ రాజ్యాంగ దినోత్సవంలో పాల్గొని మాట్లాడారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

మైనంపాడు ప్రాథమిక పాఠశాల కూడా..

సంతనూతలపాడు: మైనంపాడు ప్రాథమిక పాఠశాలను మంగళవారం మధ్యాహ్నం తహసీల్దార్ డి.ఆదిలక్ష్మి ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన నాణ్యత పై ఉపాధ్యాయులు, విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఆమె వెంట మండల విద్యాశాఖాధికారి 2 డి.వెంకారెడ్డి ఉన్నారు.

ఆర్‌డీఓ కార్యాలయంలో రాజ్యాంగ ప్రతిజ్ఞ



ఆర్‌డీఓ కార్యాలయంలో ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఆర్‌డీఓ లక్ష్మీప్రసన్న

ఒంగోలు అర్బన్: స్థానిక ఒంగోలు రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ఆర్‌డీఓ లక్ష్మీప్రసన్న అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కార్యాలయ సిబ్బందితో రాజ్యాంగ ప్రతిజ్ఞ చేయించి భారత రాజ్యాంగం ప్రకారం నడుచుకోవాలని సూచించారు. దీనిలో స్పెషల్ తహసీల్దార్ ఉషా, డిప్యూటీ తహసీల్దార్లు రామకృష్ణ, సాయి పవన్, ఏవీ శ్రీనివాస్, శ్రీరామిరెడ్డి, శ్రీకాంత్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయ పద్ధతులపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న మండల వ్యవసాయాధికారి పావని

సంతనూతలపాడు: మండలంలోని పేర్నమిట్ట, కామేపల్లివారిపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. సంతనూతలపాడు మండల వ్యవసాయ అధికారిణి పి.పావని కామేపల్లివారిపాలెంలో ప్రస్తుతం సాగులో ఉన్న శనగ పంటను పరిశీలించి సస్యరక్షణ పద్ధతులు వివరించారు. రైజోబియం జీవన ఎరువు మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో 50 శాతం రాయితీపై అందుబాటులో ఉందని తెలియజేశారు. రైజోబియం జీవన ఎరువును పేర్నమిట్ట గ్రామ రైతులకు అందజేశారు. రబీ సీజన్లో సాగు చేసిన శనగ, మినుము, వరి, జొన్న, మొక్కజొన్న, మిరప పంటలకు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద రైతు వాటా ప్రీమియం చెల్లిస్తే పంటల బీమా వర్తిస్తుందన్నారు. డిసెంబర్ 15 లోగా కామన్ సర్వీస్ సెంటర్ల ద్వారా గానీ లేదా గ్రామ సచివాలయల్లో గానీ రైతు వాటా చెల్లించాలని సూచించారు. ఉద్యానవన శాఖ అధికారిణి డి.ప్రత్యూష మాట్లాడుతూ మిరప పంటలో ఇన్సూరెన్స్ ప్రీమియం ఒక ఎకరానికి రూ.525 చెల్లిస్తే బీమా మొత్తం ఒక ఎకరానికి రూ.1,05,000 కవరేజ్ ఉంటుందన్నారు. అనంతరం సంతనూతలపాడులోని మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో పనిచేస్తున్న గ్రామ వ్యవసాయ, ఉద్యానవన సహాయకులతో మండల వ్యవసాయ అధికారిణి సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామ వ్యవసాయ, ఉద్యానవన సహాయకులంతా రైతులకు అందుబాటులో ఉంటూ వివిధ పంటలను ఆశించే చీడపీడలు, తెగుళ్ల నివారణకు సలహాలు, సూచనలు అందించాలన్నారు. సాగులో లేని భూముల వివరాలను సర్వే చేసి నమోదు చేయాల్సిందిగా ఆదేశించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు ఎస్.వెంకట్రావు, కె.వి సుబ్బారెడ్డి, గ్రామ వ్యవసాయ, ఉద్యానవన సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

సుబ్బరామిరెడ్డి ఆశయాలు కొనసాగించాలి



అల్లూరులో సుబ్బరామిరెడ్డికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

అల్లూరు (కొత్తపట్నం): మాజీ ఎంపీ, దివంగత మాగుంట సుబ్బరామిరెడ్డి ఆశయాలు కొనసాగించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ వీఆర్వో వీరేపల్లి రామచంద్రారెడ్డి కొనియాడారు. అల్లూరు, మడనూరు గ్రామాల్లో మంగళవారం మాగుంట సుబ్బరామిరెడ్డి 77వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. రెండు విగ్రహాలకు పూల మాల వేసి నివాళులర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం పాటించారు. సర్పంచ్ నంబూరి సూర్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు మిట్నసల శాంతారావు, ఉప సర్పంచ్ తాటిపర్తి సుబ్బారెడ్డి, స్వర్ణ శివారెడ్డి, సామంతులు వీరారెడ్డి పాల్గొన్నారు.



సంతనూతలపాడు: అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి మేరుగు



ప్రసంగిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి భారతి



సంతనూతలపాడు ఎంపీడీవో కార్యాలయంలో..



మద్దిపాడు ఎంపీడీవో కార్యాలయంలో..



అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న వైస్ చాన్స్‌లర్ డీవీఆర్ మూర్తి

అంబేడ్కర్ దేశ సంపద

- ఆ మహనీయుని స్ఫూర్తితోనే గత ప్రభుత్వంలో బడుగులకు సంక్షేమ ఫలాలు
- వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి మేరుగు నాగార్జున

సంతనూతలపాడు:

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ దళిత నాయకుడు మాత్రమే కాదని, ఆయన యావత్తు భారత జాతి సంపద అని వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు, సంతనూతలపాడు నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ మంత్రి డాక్టర్ మేరుగు నాగార్జున అన్నారు. రాజ్యాంగ ఆమోద దినోత్సవం సందర్భంగా మంగళవారం మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి అధ్యక్షతన అంబేడ్కర్ నగర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 75వ భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవం సందర్భంగా నియోజకవర్గ కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మేరుగు నాగార్జున మాట్లాడుతూ ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశానికి రాజ్యాంగం రాసి దేశ ప్రజలకు అంకితం ఇచ్చిన నవ భారత రాజ్యాంగ నిర్మాత, అపర మేధావి, భారత రత్న అయిన అంబేడ్కర్ సేవలను ప్రపంచ దేశాలన్నీ కొనియాడుతున్నారన్నారు. ఫెడరల్ గవర్నమెంట్ వ్యవస్థను 78 ఏళ్ల పాటు మనం బతికించుకోగలిగామంటే దానికి కారణం రాజ్యాంగం అన్నారు. అంబేడ్కర్ స్ఫూర్తితో బడుగు, బలహీన వర్గాలు, దళిత, మైనార్టీ, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల సంక్షేమానికి గత ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేశారన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని మండలాల జెడ్పీటీసీలు దుంపా రమణమ్మ, వేమా శ్రీనివాసరావు, ఎంపీపీలు బీ విజయ, యద్దనపూడి శ్రీనివాసరావు, వాకా అరుణ కోటిరెడ్డి, అంజమ్మ కృష్ణారెడ్డి, మండలాల పార్టీ అధ్యక్షులు పమిడి వెంకటేశ్వర్లు, శ్రీమన్నారాయణ, మండవ అప్పారావు, చీమకుర్తి పట్టణ అధ్యక్షుడు కిష్టపాటి శేఖర్ రెడ్డి, జెసిస్ లు దుంపా యలమందరెడ్డి, మంచా హరికృష్ణ, ఎస్ విజయ భాస్కరరెడ్డి, కౌన్సిలర్ పాటిబండ్ల గంగయ్య, తెళ్ల పుల్లారావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఇతర ముఖ్య వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించిన జెడ్పీటీసీ, ఎంపీపీ

రాజ్యాంగ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా సంతనూతలపాడు మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ అధ్యక్షురాలు బీ విజయ, జెడ్పీటీసీ దుంపా రమణమ్మ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సంతనూతలపాడు మండలం మంగమూరులోని అమృత సరోవర్ ట్యాంక్ వద్ద రాజ్యాంగం దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో డీ సురేష్ బాబు, పలువురు మండల స్థాయి అధికారులు, ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

మద్దిపాడులో..

మద్దిపాడు: రాజ్యాంగ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల పరిషత్ అధ్యక్షురాలు వాకా అరుణ కోటిరెడ్డి, అధికారులు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆమె వెంట ఎంపీటీసీలు షైన ప్రభాకర్, బొమ్మల దేవదాసు, ఎంపీడీవో వీ జ్యోతి, తహసీల్దార్ సుజన్ కుమార్, ఎంఈఓ లు ఎంవీఆర్ ఆంజనేయులు, మెడ బలిమి శ్రీనివాసరావు, ఈఓపీఆర్డీ రఘుబాబు, డిప్యూటీ తహసీల్దార్లు ఎస్.కె ఎండీ రఫీ, అజయ్ కుమార్ రెడ్డి వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఘనంగా భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవం

చీమకుర్తి రూరల్: భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో కే రాఘవేంద్ర అంబేడ్కర్ చిత్రపటానికి పూలతో నివాళులర్పించి, భారత రాజ్యాంగ గొప్పతనాన్ని వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ పి.అజిత తదితరులు పాల్గొన్నారు.

నాగులుప్పలపాడులో..

నాగులుప్పలపాడు: రాజ్యాంగ ఆమోద దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి ఎంపీడీవో వై మహాలక్ష్మి నివాళులర్పించారు. రాజ్యాంగంలోని కొన్ని అంశాలను వివరించి, సిబ్బంది చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మండల ప్రజా పరిషత్ సిబ్బంది, ఉపాధి హామీ కార్యాలయ సిబ్బంది ఒమ్మెవరం సర్పంచ్ పాలపర్తి బాలకోటి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ సంతనూతలపాడు ఇన్చార్జి విజేష్ రాజ్ ఆధ్వర్యంలో ఉప్పుగుండూరులో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. నాగులుప్పలపాడు గ్రంథాలయంలో గ్రంథపాలకుడు శ్రీనివాసులు ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

సొంత పాలన కోసమే భారత రాజ్యాంగం

■ వీసీ ప్రొఫెసర్ డీవీఆర్ మూర్తి

ఒంగోలు సిటీ: భారతదేశాన్ని భారతీయులే స్వతహాగా పరిపాలన చేసుకునే విధంగా తయారు చేసిందే అత్యున్నత వ్యవస్థ భారత రాజ్యాంగమని ఆంధ్రకేసరి యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డీవీఆర్ మూర్తి అన్నారు. మంగళవారం ఆంధ్రకేసరి యూనివర్సిటీ సమావేశపు హాలులో నిర్వహించిన రాజ్యాంగ ఆమోద దినోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రాజమోహనరావు అధ్యక్షత వహించారు. వైస్ చాన్సలర్ డీవీఆర్ మూర్తి మాట్లాడుతూ భారత రాజ్యాంగం ద్వారా భారత వ్యవస్థను నిర్దేశించినట్లు పేర్కొన్నారు. ఇప్పటి వరకు అనేక దేశాల రాజ్యాంగ వ్యవస్థలు మార్చినా భారత రాజ్యాంగంలో కేవలం సవరణలు మాత్రమే చోటు చేసుకున్నాయని చెప్పారు. భారత రాజ్యాంగం రచనలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కృషి ప్రశంసనీయమైందన్నారు. వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.నిర్మలామణి, డీన్ ప్రొఫెసర్ సోమశేఖర్, ఏసీఈ డాక్టర్ అంచుల భారతీదేవి, హెచ్‌ఓడీ డాక్టర్ బి.పద్మజ, డాక్టర్ ఆర్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఒంగోలు సిటీ: ఒంగోలు మండల ప్రజా పరిషత్ ఆవరణలో భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి ఒంగోలు ఎంపీడీఓ శేషుబాబు పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. ఈఓఆర్డీ, ఏపీఎం, ఏపీఓ, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తపట్నం: రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ ఆశయాలు కొనసాగించాలని సంకువారిగుంట ఎంపీపీ స్కూల్ హెచ్ఎం సీహెచ్ నాగేశ్వరావు అన్నారు. 75వ రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మండలంలో సంకువారిగుంటలో రాజ్యాంగ నిర్మాత భారతరత్న డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కొత్తపట్నంలో బొమ్మిశెట్టి సీతమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం మన్నెం శ్రీదేవి ఆధ్వర్యంలో 75వ రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడు సీహెచ్ కోటేశ్వరరావు చేతులతో గీసిన బీఆర్ అంబేడ్కర్ చిత్ర పటానికి ఉపాధ్యాయులు పూల మాల వేసి నివాళులర్పించారు. హైస్కూల్లో తెలుగు మాస్టర్ నాగేమల్లేశ్వరరావును సన్మానించారు. సంకువారిగుంట నుంచి కె.సింగారావు, సీహెచ్ సురేంద్ర, సీహెచ్ ఫణీంద్ర, సీహెచ్ సునంద, సీహెచ్ లీలావతి, హైస్కూల్ నుంచి స్టాఫ్‌సెక్రటరి హరిబాబు, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా ట్రెనింగ్ కమిషనర్ కొణిజేటి వెంకటశేషారావు, జిల్లా కోశాధికారి పి.వెంకట్రావు పాల్గొన్నారు.

మాల ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో..

ఒంగోలు ఒన్‌టౌన్: మాల ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో రాజ్యాంగ ఆమోద దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఒంగోలు ప్రకాశం భవన్ ఎదుట ఉన్న రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాల ఉద్యోగుల సంఘ నాయకులు కాటుకూరి బాబూరావు, యరమాల మల్లికార్జునరావు మాట్లాడుతూ ప్రపంచ మేధావి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం దేశానికి దశ దిశను నిర్దేశించిందన్నారు. ఆయన అడుగు జాడల్లో దేశం యావత్ నడుస్తోందన్నారు. కార్యక్రమంలో మాల సంఘాల జేఏసీ జిల్లా కన్వీనర్ పిల్లి మాల్యాద్రి, ఉద్యోగ సంఘ నాయకులు టి.శ్రీకాంత్, ఎరిజర్ల రమేష్, మేడిద రవి, బంటుపల్లి రాజు, లక్ష్మీనారాయణ, జాన్, బాలు పాల్గొన్నారు.

ఒంగోలు ఒన్‌టౌన్: అంబేడ్కర్ రాజ్యాంగం దేశానికి దిక్సూచి అని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు అన్నారు. అంబేడ్కర్ రాజ్యాంగం 75వ ఆమోద దినోత్సవం సందర్భంగా ఒంగోలు నీలం పాలెంలో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేవరపల్లి రమణయ్య, ఏలూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

లౌకిక రాజ్యాంగాన్ని కాపాడుకుందాం

ఒంగోలు టౌన్: మనువాదులు, మతోన్మాదుల నుంచి లౌకిక రాజ్యాంగాన్ని కాపాడుకుందామని ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి పిలుపునిచ్చారు. స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో మంగళవారం రాజ్యాంగ పరిరక్షణ దినోత్సవం నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటం ముందు రాజ్యాంగ పీఠిక చదువుతూ ప్రతిజ్ఞ చేశారు. దేశంలో సగభాగంగా వున్న మహిళలకు అనేక హక్కులను చట్టాలు రాజ్యాంగం ద్వారా కల్పించారని, ఆస్తి హక్కు కావాలని, మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన మెటర్నిటీ సెలవు కావాలని, 8 గంటల పని దినం అమలు చేయాలని, విద్యా ఉపాధి రంగాల్లో మహిళలకు ప్రాధాన్యం ఇవ్వాలని రాజ్యాంగం సూచించిందన్నారు. ఐద్వా నాయకులు గోవిందమ్మ, పెద్ద గోవిందమ్మ, జి.ఆదిలక్ష్మి, కళ్యాణి, అమిరున్నిసా పాల్గొన్నారు.

రాజ్యాంగ స్ఫూర్తిని కొనసాగిద్దాం: జేవీవీ

సమున్నత రాజ్యాంగ స్ఫూర్తిని కొనసాగిద్దామని జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి జయప్రకాష్ చెప్పారు. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని శ్రీరామ్ ఒలంపియాడ్ స్కూల్, సెయింట్ జేవియర్ బాలికల జూనియర్ కళాశాలల్లో రాజ్యాంగ ప్రాధాన్యత అనే అంశం మీద విద్యార్థులకు వకృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. జేవీవీ నగర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్వీ రంగారెడ్డి, ఎన్‌టీ వెంకటేష్ పాల్గొన్నారు. రాజ్యాంగం గురించి వకృత్వ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు శ్రీరాం ఒలింపియాడ్ స్కూలు ప్రిన్సిపాల్ రామిరెడ్డి అభినందించారు.

అంబేడ్కర్ ఆశయాలపై అవగాహన పెంచుకోవాలి

రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేడ్కర్ ఆలోచనలు, ఆశయాలపై ప్రజలందరూ అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా గ్రంథాలయ కార్యదర్శి కుసు ఆదిలక్ష్మి పిలుపునిచ్చారు. 75వ రాజ్యాంగ అమోద దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. గ్రంథాలయ ఉప పాలకురాలు బొమ్మల కోటేశ్వరి, కె.సంపూర్ణమ్మ, డి.సందీప్, కృష్ణవేణి, వై.మృదుల్, జి. శాంసన్ పాల్గొన్నారు.

దోస్తీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

దేశ ప్రజలందరికీ సమాన హక్కులు కల్పించిన బాబా సాహెబ్ అంబేడ్కర్ ఆశయాలను కొనసాగించేందుకు ప్రతి ఒక్కరూ ప్రతిజ్ఞ చేయాలని దోస్తీ ఫౌండేషన్ చైర్మన్ షేక్ మహబూబ్ పిలుపునిచ్చారు. నగరంలోని బాగ్యనగర్‌లో గల బదిరుల పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. బధిరుల పాఠశాల విద్యార్థులకు పండ్లు, కాయలు అందించారు. ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, ఫౌండేషన్ సభ్యులు నత్తల శ్రీనివాసరావు, షేక్ జానీ పాల్గొన్నారు.

అవకాశాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

■ జిల్లా ప్రధాన న్యాయమూర్తి భారతి

ఒంగోలు: రాజ్యాంగం దేశంలోని ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు కల్పించిందని, వాటిని సద్వినియోగం చేసుకుంటూ ముందుకు వెళ్లాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.భారతి అన్నారు. మంగళవారం స్థానిక జిల్లా కోర్టు వద్ద నిర్వహించిన రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమానికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి భారతి మాట్లాడుతూ రాజ్యాంగ ఆమోద దినోత్సవం ఉద్దేశ్యాన్ని, రాజ్యాంగం ప్రజలకు కల్పించిన ప్రసాదించిన హక్కులు వివరించారు. రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని పురస్కరించుకుని కార్యక్రమంలో పాల్గొన్న అందరితో ప్రతిజ్ఞ చేయించారు. అదనపు న్యాయమూర్తులు టి.రాజా వెంకటాద్రి, డి.అమ్మన్న రాజా, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.శ్యాంబాబు, ఇతర న్యాయమూర్తులు పాల్గొన్నారు.

ఒంగోలు ఒన్‌టౌన్: ఎటువంటి తారతమ్యం లేని రాజ్యాంగం భారత దేశ రాజ్యాంగం అని మాదిగ సంక్షేమ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు సుజన్ మాదిగ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఒంగోలు హెచ్‌సీఎం కళాశాల ఎదుట ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. మందా సుధాకర్ మాదిగ, జేమ్స్ మాదిగ, బాలాజీ మాదిగ పాల్గొన్నారు.



ఒంగోలు మండల పరిషత్‌లో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ శేషుబాబు



సంకువారిగుంటలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న విజయకుమార్



అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న మాల ఉద్యోగులు



అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పిస్తున్న ఎంపీడీవో, అధికారులు



చీమకుర్తిలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ రాఘవేంద్ర



ఐద్వా ఆధ్వర్యంలో జరిగిన రాజ్యాంగ పరిరక్షణ దినోత్సవంలో మహిళలు



పాఠశాల విద్యార్థులకు బహుమతులు అందజేసిన జేవీవీ



దోస్తీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బధిరుల పాఠశాలలో పండ్లు పంపిణీ



అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న నాగేంద్రం